క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నం టౌన్: స్థానిక భాస్కరపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 20వ తేదీ శనివారం విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఎం. భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకూ రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. బాబానగర్, పెద్ద కరగ్రహారం, క్యాంప్‌బెల్‌పేట, ఆర్టీసీ కాలనీ, ఆశీర్వాదపురం, ఆదర్శనగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

బంటుమిల్లి: నాగేశ్వరరావుపేట పంచాయతీ పరిధిలోని జానకిరామపురం, లక్ష్మీనారాయణపురం గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎం.రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈఆర్వో కార్యాలయం మార్గంలో హద్దుల గుర్తింపు



పెడన: నామినేషన్ల సందర్భంగా ఎన్నికల అధికారి కార్యాలయానికి(ఈఆర్వో) వెళ్లే మార్గాల్లో హద్దులు గుర్తించి మార్కింగ్ వేశారు. ఈఆర్వో కార్యాలయానికి నాలుగు మార్గాల్లో 200 మీటర్లు, వంద మీటర్లు గుర్తించి ఆయా పాయింట్ల వద్ద సున్నం చల్లే చర్యలను మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య శుక్రవారం తీసుకున్నారు. పెడన ఎన్నికల అధికారి పి.వెంకటరమణ ఆదేశాల మేరకు హద్దులు గుర్తించి మార్కింగ్ చేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు. 200 మీటర్లు వరకు ర్యాలీలు, 100 మీటర్లు వరకు అభ్యర్థి కారులో వచ్చేందుకు మాత్రమే అనుమతులున్నాయని, దీంతో ఈ మార్కింగ్‌లు చేసినట్లు కమిషనర్ తెలిపారు.

ప్రధానోపాధ్యాయినికి సత్కారం



నాగాయలంక: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ ప్రధానోపాధ్యాయురాలు కసిరెడ్డి శాంత కుమారికి శుక్రవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. రెండేళ్లుగా ఈ పాఠశాలలో హెచ్.ఎంగా పనిచేస్తున్న ఆమె కొద్ది రోజుల క్రితం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యా కుటుంబం, పీఎంసీ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం చోడిశెట్టి ప్రహ్లాదకుమార్ అధ్యక్షతన అభినందన సభ జరిగింది. శాంతకుమారి, నాగేశ్వరరావు దంపతులను సన్మానించారు. పీఎంసీ చైర్మన్ కన్నా లక్ష్మీకుమారి, గాజుల లక్ష్మీ ప్రసాద్, పద్యాల రఘురామ్, ఎం.పద్మజ, ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్నకు నివాళి



పెడన: సర్దార్ గౌతు లచ్చన్న జీవిత విశేషాలు భావి తరాలకు తెలిసే విధంగా ఒక పాఠంగా చేర్చాలని సర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధన కమిటీ కోరింది. శుక్రవారం లచ్చన్న వర్ధంతి పురస్కరించుకుని స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని మహాత్ముని విగ్రహం వద్ద లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బెజవాడ నాగరాజు, వీరంకి నరసింహరావు, అఖిల పక్ష నాయకులు బండారు మల్లికార్జునరావు, చొడవరపు అప్పారావు, కట్టా హేమ సుందరరావు, కట్టా జ్యోతిశ్వరరావు, మామిడి లక్ష్మీ నారాయణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నాగాయలంక తహసీల్దార్‌గా సుబ్బారావు



నాగాయలంక: నాగాయలంక తహసీల్దార్‌గా కె.సుబ్బారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కృష్ణా కలెక్టరేట్ నుంచి బదిలీపై వచ్చారు. తొలుత కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు స్వాగతం పలికి అభినందించారు. కొన్ని నెలలుగా పూర్తి స్థాయి తహసీల్దార్ లేకపోవడంతో ఇప్పటి వరకు కోడూరు మండల తహసీల్దార్ శ్రీనివాసరావు ఎఫ్ఏసీ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా తనను కలసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం లేకుండా ప్రజల సహకారంతో సాధారణ ఎన్నికల విధినిర్వహణ కొనసాగిస్తానని, ఉన్నతాధికారుల ఆదేశాలు, సూచనల మేరకు పని చేస్తానని చెప్పారు. రాష్ట్ర వీర్వోల సంక్షేమ సంఘం నాయకుడు టి.జి.సాయిబాబు, కార్యాలయ సూపరింటెండెంట్ సనకా జనార్ధన్, వీఆర్వోలు, వీఆర్ఏలు స్వాగతం పలికారు. అనంతరం పోలింగ్ బూత్ అధికారులతో తహసీల్దార్ సమావేశమై పలు సూచనలు చేశారు.

సంక్షేమం, అభివృద్ధి చూసి ఓటేయండి

- తరకటూరులో విస్తృత ప్రచారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ అభ్యర్థులు



తరకటూరులో మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఉప్పాల రాము

గూడూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి సంక్షేమం చూసి ఓటేయాలని ఆ పార్టీ బందరు పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము ప్రజలను కోరారు. ప్రజాదీవెన యాత్రలో భాగంగా శుక్రవారం గూడూరు మండలం తరకటూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పరిపాలన అందించారన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చాలన్న లక్ష్యంతో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. మరో పక్క ఏ గ్రామంలో చూసినా అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు ప్రజలు తమ పట్ల చూపిస్తున్న ఆదరణ దీనికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతు తెలుపుతూ ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి తమను గెలిపించాలని వారు అభ్యర్థించారు.

-తరకటూరు వెళ్లే మార్గంలోని నాగులేరుపై ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న వంతెనల స్థానంలో కొత్తవి నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు ఆధ్వర్యంలో స్థానికులు విజ్ఞప్తి చేశారు.

గ్రామంలోని రైతుల పంట పొలాలకు వెళ్లే గుంటూరు రాస్తాను పూర్తి స్థాయిలో బీటీ రోడ్డుగా నిర్మించాలని గ్రామస్తులు కోరారు. దీనిపై స్పందించిన డాక్టర్ చంద్రశేఖరరావు, ఉప్పాల రాము వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, మాజీ జెడ్పీటీసీ బూరగడ్డ శ్రీకుమార్, నాయకులు గొరిపర్తి రవికుమార్, జక్కా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- సింహాద్రి వికాస్, నిశ్చల
- తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ ప్రచారం



తాడేపల్లి ప్రచారంలో సింహాద్రి రమేష్‌బాబు తనయుడు వికాస్, కుమార్తె నిశ్చల

తాడేపల్లి(ఘంటసాల): ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాలంటే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు తనయుడు, యువనేత సింహాద్రి వికాస్ అన్నారు. ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక నేతలతో కలసి రమేష్‌బాబు తనయుడు వికాస్, కుమార్తె నిశ్చల నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లిలోని కుమ్మరిపాలెం, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలు, ప్రధాన గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఆయా కాలనీల్లో పలువురు వృద్ధులు, అక్క చెల్లెమ్మలు ఈ నెల ఇంటి వద్దకు పెన్షన్లు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఇంటి వద్దే పింఛన్లు ఇప్పించాలని కోరారు. స్పందించిన యువనేత వికాస్ మాట్లాడుతూ కుల, మతాలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించిన ఘనత ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అవ్వాతాతలు, అక్క చెల్లెమ్మలు గత ప్రభుత్వంలో పడుతున్న ఇబ్బందులను పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యక్షంగా చూశారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. పెత్తందారులు మహాకూటమిగా ఏర్పడి వ్యవస్థల ద్వారా పేదల సంక్షేమం, అభివృద్ధిని అడ్డుకోవడానికి యత్నిస్తున్నారన్నారు. మూకుమ్మడిగా వస్తున్న పెత్తందారులకు మనందరం ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పి ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్ బాబును, ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును గెలిపించాలన్నారు. తొలుత తాడేపల్లి గిల్గాలు చర్చిలో పాస్టర్ కె.సతీష్ పాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, జెడ్పీటీసీలు తుమ్మల మురళీకృష్ణ, లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ కొల్లూరి విజయ, సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, వైఎస్సార్ సీపీ సేవాదళ్, రైతు, యూత్, ప్రచార విభాగాల మండల అధ్యక్షులు దిరిశం పిచ్చేశ్వరరావు, మూల్పూరి వెంకయ్య, అంగడాల నాగరాజు, గోనెపాటి పిచ్చేశ్వరరావు, నేతలు పాల్గొన్నారు. మండలంలోని వి.రుద్రవరం, చిలకలపూడి గ్రామాల్లో రమేష్‌బాబు కుమార్తెలు నిశ్చల, సహజ, అల్లుడు డాక్టర్ తన్నీరు రంగనాథ్ శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ కొలుసు ఝాన్సీలక్ష్మి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కుంపటి శరత్‌బాబు, మాజీ సర్పంచ్ తూము రామారావు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెడనలో ప్రజాదీవెన

పెడన: పట్టణంలో 20 నుంచి 23వ వార్డు వరకు ప్రజాదీవెన కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ పెడన అసెంబ్లీ అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) శనివారం ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ పెడన పట్టణ కన్వీనర్ బండారు మల్లికార్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు 23వ వార్డులోని ఆంజనేయస్వామి గుడి వద్ద ప్రత్యేక పూజలు అనంతరం ప్రచారం చేస్తారని పేర్కొన్నారు.

నామినేషన్ ఘట్టాలను విజయవంతం చేయండి

పేర్ని నాని పిలుపు

మచిలీపట్నం టౌన్: వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్ ఘట్టాలకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య(నాని) పిలుపునిచ్చారు. నూతనంగా స్థానిక లక్ష్మీటాకీస్ సెంటర్ వద్ద ప్రారంభించిన పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ సోమవారం మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేస్తారన్నారు. మచిలీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) ఈ నెల 23వ తేదీ మంగళవారం కలెక్టరేట్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారన్నారు. నామినేషన్ల కార్యక్రమాలకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దివ్యాంగులు, 85 ఏళ్లు దాటిన వారికి ఇంటివద్దే ఓటింగ్

మోపిదేవి: దివ్యాంగులు, 85 ఏళ్లు నిండిన వృద్ధులకు సార్వత్రిక ఎన్నికల్లో వారి ఇంటివద్దనే ఓటింగ్ చేసే అవకాశం కల్పించినట్లు తహసీల్దార్ శ్రీ విద్య తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం బీఎల్వోల సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి బూత్ లెవెల్‌లో ఉన్న పీడబ్ల్యూడీ వికలాంగులు, వృద్ధులను గుర్తించి వారి నుంచి అంగీకార పత్రాలు స్వీకరించాలని సూచించారు. మండలంలోని 38 పోలింగ్ బూత్‌ల్లో ఇలాంటి వారు 700కు పైగా ఓటర్లు వివిధ రకాల పింఛన్లు పొందుతుండగా 52 మంది పోలింగ్ బూత్ వద్దకు రాలేమని చెప్పడంతో వారి నుంచి అంగీకార పత్రాలు స్వీకరించాలని ఆదేశించారు. మిగిలినవారి నుంచి కూడా పోలింగ్ బూత్ వద్దకు వస్తామని అంగీకార పత్రాలు తీసుకోవాలని చెప్పారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి



వెంకట దుర్గాంబ పురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మత్స్యకారుల పక్షపాతి అని, వారి అభివృద్ధికి కృషి చేశారని వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కిట్టు అన్నారు. వెంకట దుర్గాంబపురంలో శుక్రవారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ మత్స్యకారుల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు పరిచారన్నారు. చేపల వేట నిషేధ సమయంలో ప్రతి కుటుంబానికి పదివేల రూపాయలను అందించి ఆర్థిక భరోసా కల్పించారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతు ఇచ్చి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలోపార్టీ మండల ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడి బాగుంది..

- నాడు-నేడుతో సుందరీకరణ
- పెడన నియోజకవర్గంలో మొదటి విడతలో రూ.15.73 కోట్లు విడుదల
- రెండో విడతలో రూ.24.07 కోట్లతో పనులు



పెనుమల్లి ప్రాథమిక పాఠశాల




సుందరంగా పెడన మండలం కృష్ణాపురం ప్రాథమిక పాఠశాల



పెడన ఐదో వార్డులో ఉర్దూ బాలికల పాఠశాలలో కుళాయిలు



పెనుమల్లి తరగతి గదిలో డిజిటల్ టీవీ, బోర్డులు, బొమ్మలు



పెడన మండలం ఉరివి ప్రాథమికోన్నత పాఠశాలలో డ్యూయెల్ డెస్కులు

పెడన: అభివృద్ధి అంటే రోడ్లు ఒక్కటే కాదు. మన సమాజంలో మిగిలినవి చాలా ఉన్నాయి. వాటిలో ప్రధానమైంది మన పిల్లల చదువు బాగుండాలనే సంకల్పంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యమిచ్చింది. అందులో భాగంగానే ప్రభుత్వ బడులను ఆధునికీకరించడంతో పాటు పిల్లలు చదువులు ఆహ్లాదకరమైన వాతావరణంలో నేర్చుకోవాలనే తలంపుతో నిధులు కేటాయించారు. ఐదేళ్లలో ప్రభుత్వ బడుల కోసం పెడన నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మొదటి, రెండు విడతల్లో విడుదలైన నిధులు మంజూరుతో ప్రభుత్వ పాఠశాలలు ఆధునికీకరించారు... అభివృద్ధి చేస్తున్నారు. మొదటి విడతగా పెడన నియోజకవర్గంలో రూ.15.73 కోట్లతో 50 ప్రాథమిక, 25 ప్రాథమికోన్నత, 8 జెడ్పీహెచ్ఎస్‌లతో పాటు గురుకుల పాఠశాలను ఆధునీకీరించారు. రెండో విడతలో రూ.24.07 కోట్లు రావడంతో 46 ప్రాథమిక పాఠశాలలు, 8 ప్రాథమికోన్నత పాఠశాలలు, 25 జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఒక కళాశాల, ఐదు అంగన్‌వాడీలు ఆదునికీకరణ చేస్తున్నారు.

- పెడనలో.. మొదటి విడతగా రూ.3.69కోట్లు మంజూరవ్వగా 15 పాథమిక పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత పాఠశాలలు, 2 జెడ్పీ ఉన్నత పాఠశాలలున్నాయి. బల్లిపర్రులోని గురుకుల పాఠశాలను కూడా నాడు నేడు కింద ఆధునికీకరించారు. రెండో విడతలో రూ.2.82కోట్లతో 17 ప్రాథమిక పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత పాఠశాలలు, 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనులు జరుగుతున్నాయి.
- బంటుమిల్లి మొదటి విడతలో రూ. 6.42కోట్లు రాగా 2 ఉన్నత పాఠశాలలు, 8 యూపీ పాఠశాలలు, 12 ప్రాథమిక పాఠశాలలున్నాయి. రెండో విడతలో రూ. 4.23 కోట్లతో ఒక ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఒక అంగన్‌వాడీ కేంద్రం, 3 యూపీ పాఠశాలలు, 6 ఉన్నత పాఠశాలలు, 12 ప్రాథమిక పాఠశాలలున్నాయి.
- గూడూరు మండలంలో మొదటి విడతలో 15 మండల పరిషత్ ప్రాథమిక, 7 మండల పరిషత్ ప్రాథమికోన్నత, 2 జెడ్పీ ఉన్నత పాఠశాలలను రూ.3.22కోట్ల వ్యయంతో పూర్తి స్థాయిలో రూపురేఖలు మార్చారు. రెండో విడతలో 11 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, మండల పరిషత్ ప్రాథమికోన్నత, 5జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను రూ.4.32 కోట్ల వ్యయంతో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి.
- కృత్తివెన్ను మండలంలో మొదటి ఫేజ్‌లో రూ.2.4 కోట్లతో 8 ప్రాథమిక పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత పాఠశాలలు, 2 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు అభివృద్ధి చెందాయి. రెండో విడతలో రూ.13.40 కోట్లుతో 6 ప్రాథమిక పాఠశాలలు , 9 జెడ్పీహెచ్ఎస్‌లు, నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి.

ప్రతి ఇంటా సంక్షేమం

అవనిగడ్డ అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు



కోడూరులో ఓటు వేసి గెలిపించాలని కోరుతున్న సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని చేరువ చేసి, పేదలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం కోడూరు రెండో వార్డులో రమేష్‌బాబు, యువనేత సింహాద్రి వికాస్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. రమేష్‌బాబు మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ పథకాలను అందించినట్లు చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయడంతో పాటు ఇచ్చిన హామీలను నేర్చినట్లు తెలిపారు. మండల ప్రజలకు అతి ముఖ్యమైన సమస్యగా ఉన్న కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణాన్ని కూడా పూర్తి చేస్తున్నట్లు రమేష్‌బాబు చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక మందికి రైతులకు మేలు చేస్తూ 22ఏ నిషేధిత భూముల సమస్యను పరిష్కరించి, అన్నదాతల ఇళ్లలో వెలుగు నింపారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ప్రజలందరూ తమ ప్రభుత్వం చేసిన మంచిని గుర్తించి తనను మరోసారి ఎమ్మెల్యేగా, సింహాద్రి చంద్రశేఖరరావును ఎంపీగా గెలిపించాలని రమేష్‌బాబు కోరారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, నేతలు కోట పద్మావతి వరప్రసాద్, వెన్నా ప్రసాద్, బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, ఇంకొల్లు మురళీకృష్ణ, బడే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జెడ్పీ పాఠశాల వార్షికోత్సవం



సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్న విద్యార్థులు

కోడూరు: కోడూరు జెడ్పీ పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో వేడుకలను హెచ్‌ఎం ఆలా వెంకటరమణ పర్యవేక్షణలో జరిగాయి. ఉదయం సభను నిర్వహించి విద్యాసంవత్సరంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. పాఠశాల నుంచి ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంప్రదాయ దుస్తులతో విద్యార్థినులు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు, హెచ్‌ఎంలు నాగరత్నకుమారి, సుధారాణి, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు బూరగడ్డ హరినాథ్‌బాబు, అన్నం సురేష్, యోగానంద్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతిష్టా మహోత్సవాలు ప్రారంభం



ప్రతిష్టా మహోత్సవాల్లో ప్రత్యేక పూజలు

బంటుమిల్లి: నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు లక్ష్మీనారాయణపురం గ్రామంలో పునః నిర్మించిన శ్రీకోదండ రామాలయలో శ్రీసీతారాముల విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా పండితుల వేద మంత్రాల మధ్య పలువురు దంపతుల దీక్షధారణలతో ఉదయం పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, సాయంత్రం అంకురారోపణ, ధ్వజారోహణం, శ్రీ సీతారామలక్ష్మణ సహిత అభయాంజనేయస్వామి విగ్రహాలకు ధాన్యం, క్షీరం, నీళ్లు, పూలతో అధివాసాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రసవాలు ప్రభుత్వ వైద్యశాల్లోనే జరిగేలా చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ శ్రావణ్‌కుమార్

పామర్రు: అన్ని ప్రసవాలు ప్రభుత్వ వైద్యశాలలోనే జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కో-ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్(డీసీహెచ్ఎస్) అధికారి శ్రావణ్‌కుమార్ అన్నారు. స్థానిక సీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, రిజిష్టర్లతో పాటు ల్యాబ్‌లను ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వేసవిలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణాలను ప్రజలకు పంపిణీ చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా అందుతున్న సేవలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలో ఓపీల శాతాన్ని మరింతగా పెంపుదల చేయాలన్నారు. పామర్రు సీహెచ్‌సీ వైద్యులు నీలిమ, దీప్తి, నాగేశ్వరరావు, బదరీనాథ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా పూర్ణాహుతి

మచిలీపట్నం టౌన్: శ్రీ సీతారాముల వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రధాన రహదారిలోని శ్రీ భద్రాద్రి శ్రీ రాముల వారి దేవస్థానంలో శుక్రవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నిత్య హోమం, బలిహరణ, మహా పూర్ణాహుతి, చక్రస్నానం వంటి కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో చేశారు. రాత్రికి ధ్వజావరోహణం చేశారు.

అవనిగడ్డలో స్వతంత్ర అభ్యర్థిగా ‘నాదెళ్ల’ నామినేషన్

అవనిగడ్డ: అవనిగడ్డ శాసనసభ నియోజకవర్గానికి తొలి నామినేషన్ దాఖలైంది. ఇండిపెండెంట్ అభ్యర్థిగా అవనిగడ్డకు చెందిన నాదెళ్ల గిరిధర్‌నాయుడు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి బాలసుబ్రహ్మణ్యంకు అందజేశారు.

విమాన గోపుర ప్రతిష్టా మహోత్సవం

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలోని గీతామందిరం విమాన గోపుర ప్రతిష్టా మహోత్సవం పురస్కరించుకుని శుక్రవారం వాస్తు పూజా కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు దాశరథి శ్రీనివాస దీక్షితులు పూజలు చేశారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి దంపతులు పాల్గొన్నారు. ప్రతిష్టా మహోత్సవం పురస్కరించుకుని మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు పర్యవేక్షించారు.

వైభవంగా సామూహిక సత్యవ్రతాలు

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక సత్యదేవ వ్రతాలు నిర్వహించారు. ఆగమ పండితులు దీవి బాలకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పలువురు అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు దంపతులు వ్రత పూజా సామగ్రిని ఉచితంగా అందజేశారు.

అర్చకులు దీవి నరసింహమూర్తి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

హనుమంత వాహనంపై శ్రీవారి ఊరేగింపు

మచిలీపట్నం టౌన్: బచ్చుపేటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో దివ్య తిరు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం స్వామివారు హనుమంత వాహనంపై నగర వీధుల్లో ఊరేగారు. ఆలయంలో ఉదయం, సాయంత్రం వేళల్లో స్వామి వారికి పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ముత్తేవి రవికాంత్, కార్యనిర్వహణాధికారి ఎస్ఎస్ చక్రధరరావు పర్యవేక్షించారు.

- అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో చలివేంద్రం

బంటుమిల్లి: స్థానిక గాంధీ మండపం వద్ద శ్రీ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. సంప్రదాయ పద్ధతిలో చలివేంద్రం ప్రారంభించి మొదటిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వామి కొల్లా రాంబాబు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు సుజ్ఞానం జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

